
# ఆనంద్ దేవరకొండ కొత్త చిత్రం



ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. ఆదిత్యహాసన్ దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ నిర్మిస్తున్నాయి. వైష్ణవి చైతన్య కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర కథానాయిక రష్మిక మందన్న క్లాప్‌నివ్వగా, శివాజీ కెమెరా స్విఛాన్ చేశారు. దర్శకుడు వెంకీ అట్లూరి స్క్రిప్ట్ నందించారు. అందమైన ప్రేమ కథా చిత్రమిదని, ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుందని, జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు. '90s' వెబ్‌సిరీస్‌తో దర్శకుడు ఆదిత్య హాసన్ మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు. ఆ కథకు కొనసాగింపుగానే తాజా సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

## భారతీయ సినిమా పితామహుడిగా?



ఇప్పటివరకూ మాస్ పాత్రలతో మెప్పించిన అగ్ర హీరో ఎన్టీఆర్.. తొలిసారి ఓ సమాంతర చిత్రంలో నటించనున్నట్టు తెలుస్తున్నది. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే పాత్రలో ఆయన కనిపించనున్నారట. ఈ వార్త బాలీవుడ్ మీడియాలో బలంగానే వినిపిస్తున్నది. రెండేళ్ల క్రితం అగ్ర దర్శకుడు రాజమౌళి.. తన సమర్పణలో 'మేడ్ ఇన్ ఇండియా' అనే బహుభాషా చిత్రం రూపొందనున్నదనీ, ఈ సినిమాను వరుణ్ గుప్తాతో కలిసి తన తనయుడు కార్తికేయ నిర్మిస్తారని, నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తారని తెలిపారు. భారతీయ సినిమా గొప్పతనం ప్రపంచానికి తెలిసేలా రూపొందే ఈ సినిమాలో 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా' దాదాసాహెబ్ ఫాల్కే జీవితం చాలా కీలకంగా ఉంటుందట. ఆ పాత్రనే ఎన్టీఆర్ పోషించనున్నారట. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కి తారక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారని బాలీవుడ్ మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి. భారతీయ సినిమా పుట్టుక, ఎదిగిన తీరును ప్రపంచానికి చూపే సినిమా ఇదని, స్క్రిప్ట్ విని ఎన్టీఆర్ ఆశ్చర్యపోయారని, ఫాల్కే పాత్ర పోషించేందుకు ఆయన ఉత్సాహంగా ఉన్నారని, ఫైనల్ స్క్రిప్ట్ కూడా లాక్ అయ్యిందని బాలీవుడ్ మీడియా పేర్కొన్నది. ఇదే నిజమైతే ఎన్టీఆర్ కెరీర్‌లో ఇప్పటివరకూ నటించిన పాత్రలన్నింటిలో గొప్ప పాత్ర ఇదే అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## థగ్ లైఫ్ హంగామా షురూ



భారతీయ సినీచరిత్రలోని టాప్ 20 క్లాసిక్స్‌లో ఒకటిగా నిలిచిన చిత్రం కమల్, మణిరత్నం కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు'. ఆ సినిమా వచ్చిన 38ఏళ్ల తర్వాత మళ్లీ కమల్‌హాసన్, మణిరత్నం కలిసి పనిచేస్తున్న సినిమా 'థగ్‌లైఫ్'. అందుకే ఈ పాన్ ఇండియా సినిమాకోసం సగటు ప్రేక్షకుడు సైతం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్స్‌లో వేగం పెంచారు. ఇప్పటికే విడుదలైన తొలిపాటకు ప్రేక్షకుల్లో మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ఈ నెల 17న ఈ సినిమా ట్రైలర్‌ని ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్టు గురువారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. అలాగే ఈ నెల 24న హైదరాబాద్‌లో ఆడియో లాంచ్, ఈ నెల 29న విశాఖపట్టణంలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఈ ప్రకటనలో మేకర్స్ పేర్కొన్నారు. శ్రేష్ఠ్ మూవీస్ పతాకం ద్వారా ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. త్రిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శింబు ఓ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాతలు: కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్, మణిరత్నం, శివ అనంత్, ఉదయ్‌నిధి స్టాలిన్, నిర్మాణం: రాజ్‌కమల్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్.

## అంతా విచిత్రంగా చూస్తే, ఆమె మాత్రం..



సినిమారంగంలో రాణించాలనే కోరిక బలంగా ఉన్నా.. ఆ విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహం మాత్రం తెలుగమ్మాయిలకు అరుదే. కాస్టింగ్ కౌచ్ అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే సినిమా రంగం అనేసరికి భూతద్దంలో చూడటం సమాజానికి పరిపాటైపోయింది. యాక్టర్‌గా రాణించే విషయంలో తెలుగమ్మాయిలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవ్వడానికి అదికూడా ఓ కారణం. ఈ విషయంలో తనది మాత్రం భిన్నమైన అనుభవమని అంటున్నది అచ్చతెలుగు అందం రీతూవర్మ. 'మా ఇంట్లో అందరూ ఇంజనీర్లూ, డాక్టర్లే. మా అమ్మ అయితే.. సొంతంగా స్కూల్ రన్ చేస్తున్నారు. నాకేమో చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇంట్రస్ట్.

ఈ విషయం ఇంట్లో చెప్పినప్పుడు అంతా నన్ను విచిత్రంగా చూశారు. కానీ అమ్మ మాత్రం 'వెళ్లు.. ఓ ప్రయత్నం చేయ్' అంటూ ప్రోత్సహించారు. అమ్మకు నాపై ఉన్న నమ్మకం అలాంటిది. కెరీర్ తొలినాళ్లలో చిన్న చిన్న పాత్రలు చేస్తున్నప్పుడు కూడా అమ్మ నన్ను తప్పు పట్టలేదు. నిజంగా ఆమె సహకారం వల్లే ఈ రోజు హీరోయిన్ స్థాయికి చేరుకోగలిగా. అమ్మ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నా. ఇండస్ట్రీలో జరిగే ప్రతి విషయాన్నీ అమ్మతో పంచుకుంటా. సమస్యలెదురైతే వాటిని కూడా అమ్మతోనే షేర్ చేసుకుంటా. వాటికి వెంటనే అమ్మ పరిష్కారం చెప్పేస్తుంది. అమ్మ వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. నాకు మాత్రం ఏ లోటూ రానివ్వదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ రీతూవర్మ.

## అభిమాని కథ.. ఆంధ్ర కింగ్ తాలూకా



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 22వ చిత్రానికి 'ఆంధ్ర కింగ్ తాలూకా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. గురువారం హీరో రామ్ పుట్టినరోజు సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో రామ్.. టాప్ హీరో ఆంధ్ర కింగ్ సూర్యకుమార్ అభిమానిగా కనిపించారు. సినిమా రిలీజ్ రోజు తన అభిమాన హీరో స్టైల్‌ని అనుకరిస్తూ థియేటర్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రామ్...'ఆంధ్రాకింగ్ ఫ్యాన్స్ తాలూకా..' అంటూ యాభై టిక్కెట్లు అడుగుతాడు. వెంటనే మేనేజర్ టిక్కెట్లు ఇస్తాడు. దాంతో తను ఫ్యాన్స్‌తో కలిసి సంబరాలు చేసుకుంటాడు. అభిమాని పాత్రలో రామ్ సరికొత్త మేకోవర్‌తో కనిపించారు. విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్-మెర్విన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్.

## SSMB29లో చియాన్ విక్రమ్?



బాహుబలి ఫ్రాంచైజీ, ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాల తర్వాత ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల జాబితాలో చేరారు రాజమౌళి. ప్రస్తుతం ఆయన మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ 29'పై ప్రపంచవ్యాప్తంగా అంచనాలున్నాయి. ఈ ప్రస్టేజియస్ పాన్ ఇండియా సినిమాలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం వెర్సటైల్ హీరో చియాన్ విక్రమ్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగం కానున్నారట. ఇటీవలే విక్రమ్‌కి రాజమౌళి కథ వినిపించారట. ఆయన కూడా రాజమౌళీ సినిమాలో నటించేందుకు ఉత్సాహం చూపిస్తున్నట్టు తెలుస్తున్నది.అమేజాన్ అడవుల నేపథ్యంలో నిధి అన్వేషణే ప్రధానాంశంగా రూపొందనున్న ఈ సినిమాలో విక్రమ్ పాత్ర చాలా కీలకంగా ఉండబోతున్నదని సమాచారం. ప్రఖ్యాత భారతీయ నటులతోపాటు, హాలీవుడ్‌కి చెందిన నటులు కూడా భాగమవుతున్న ఈ సినిమాకు మాటలు: దేవకట్టా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాత: కె.ఎల్.నారాయణ, నిర్మాణం: దుర్గా ఆర్ట్స్.

## లోకం మారిందా..



మహేష్ చింతల, విద్యాసాగర్ కారంపురి, మురళీధర్‌గౌడ్ లీడ్ రోల్స్ పోషిస్తున్న చిత్రం 'బద్మాషులు'. శంకర్ చేగూరి దర్శకుడు. బి.బాలకృష్ణ, సి.రామశంకర్ నిర్మాతలు. జూన్ 6న సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన ఫస్టులుక్కీ, టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ చెబుతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'లోకం మారిందా..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. హీరో నవీన్‌చంద్ర ఈ పాటను విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. స్వచ్ఛమైన వినోదంతో కూడిన రూరల్ కథాంశమిదని, అన్ని వర్గాల ప్రేక్షకులకూ కనెక్టయ్యేలా సినిమా వస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు.



## ఊహించలేని కొత్త పాయింట్‌తో..

అశ్విన్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మెడికో థ్రిల్లర్ కథాంశమిది. గురువారం ఈ సినిమా టీజర్‌ను మ్యూజిక్ డైరెక్టర్ తమన్, దర్శకుడు శైలేష్ కొలను విడుదల చేశారు. 'ధర్మం దారి తప్పినప్పుడు, ఏ అవతారం రానప్పుడు, వచ్చినవాడు గౌతమ్..' అంటూ హీరో మనోజ్ మంచు వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. హీరో అశ్విన్‌బాబు పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించారు. ఈ సందర్భంగా అశ్విన్‌బాబు మాట్లాడుతూ.. ఎవరూ ఊహించలేని కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే అంశాలుంటాయని అన్నారు. రొటీన్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కు భిన్నంగా ఉండే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని, సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందని నిర్మాత తెలిపారు. రియా సుమన్, అయేషాఖాన్, మురళీశర్మ, సచిన్‌ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌర హరి, నిర్మాణ సంస్థ: అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మామిడాల ఎం.ఆర్.కృష్ణ.

## జూనియర్ ఎమోషనల్ జర్నీ

కిరీటిరెడ్డి, శ్రీలీల జంటగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందుతున్న ద్విభాషాచిత్రం 'జూనియర్'. రవిచంద్రన్, జెనీలియా కీలక పాత్రలు పోషించారు. రాధాకృష్ణ దర్శకుడు. రజనీ కొర్రపాటి నిర్మాత. జూలై 18న సినిమాను విడుదల చేయనున్నట్టు టీమ్ గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా రిలీజ్‌డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రధాన తారాగణమంతా ఆనందంగా కనిపిస్తుండగా, జెనీలియా మాత్రం సీరియస్ లుక్‌తో దర్శనమిస్తున్నారు. కుటుంబం అంతా కలిసి చూడదగ్గ భావోద్వేగ ప్రయాణమే ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి సంభాషణలు: కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని, కెమెరా: కె.కె.సెంథిల్‌కుమార్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణం: వరాహి చలనచిత్రం.



## సందేశాత్మకంగా 'జనం'



సుమన్, అజయ్ ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. స్వీయ దర్శకత్వంలో వెంకటరమణ పసుపులేటి రూపొందించారు. ఈ నెల 29న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయబోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కిందని మేకర్స్ తెలిపారు. దర్శకనిర్మాత వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ 'రాజకీయ వ్యవస్థలోని లోపాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి తరానికి చక్కటి సందేశాన్నందిస్తుంది. ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు. సందేశంతో పాటు థ్రిల్లింగ్ అంశాలుంటాయి' అన్నారు.

## వర్జిన్ బాయ్స్ హంగామా



గీతానంద్, మిత్రాశర్మ జంటగా నటించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ దర్శకుడు. రాజ్‌గురు ఫిల్మ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మించారు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేటి జనరేషన్ రిలేషన్ షిప్స్‌ను ప్రజెంట్ చేసే చిత్రమిది. చక్కటి వినోదం, రొమాన్స్, ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది. యువతను మెప్పించే అన్ని అంశాలుంటాయి. పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, యూత్‌కు రిలేట్ అయ్యే అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని నిర్మాత పేర్కొన్నారు. శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, దర్శకత్వం: దయానంద్.





